


# కథల్లో మనుష్యులు

గోపిగాడు గోపాలరావు అని పేరు మార్చుకున్నాడు. తన చింపిరి గుడిసెకు 'ఆనందభవన్' అని పేరుపెట్టాడు.

పోలిగాడి కూతురు పోచమ్మను పాంచాలి అని పిలుద్దామనుకున్నాడు. వాళ్ల గుడిసె గూడా అతని 'ఆనందభవన్'కు దగ్గరలోనే వుంటోంది. దానికి ఎటువంటి పేరు పెట్టితే బాగుంటుందో తెమలక వూరుకున్నాడు.

గోపాలరావు కథానాయకుడు. సినిమా హీరోకి పెట్టగా వచ్చిన గిరజాల జుట్టు, కొయ్య కత్తులతో, నిజం కత్తులతో మాదిరి పోట్లాడగల పరాక్రమం అతనికి సహజంగా వున్నాయని అనుకున్నాడు. అతని జుట్టు నొక్కులు తిరిగి వుంటుంది. ముంగురులు నుదుటమీద పడతాయి గాని గాలికి అల్లల్లాడటం లేదు. అందుకని గాలి బాగా వస్తున్నప్పుడు వూరి బయటకు పోయి అద్దంలో తన ముఖం చూసుకుంటాడు. అతని ముఖకవళికలో ఎక్కడినుంచో ఆనందరేఖ వకటి తొంగి చూస్తుంది. ఆ రేఖ వెంబడి బయలుదేరి అతని మనస్సు ప్రయాణం కట్టుకుంది. రైలుస్టేషనూ.... మద్రాసు నగరం... సినిమా స్టూడియో.... డైరెక్టరు ఆహ్వానం.... తనతోపాటు రాణిగా నటించబోయే నటీమణి వయ్యారం.... కెమేరా ముందు నుంచోవటం... లక్షల రూపాయలు తను పెట్టుకోవటానికి చోటు లేకుండా మీద వర్షించటం....

ఆ రేఖ అంతటితో ఆగిపోతుంది. అతని ప్రయాణం తిరుగుముఖం పడుతుంది. తను

దర్శించినవన్నీ తిరుగు ప్రయాణంలో రైల్వేస్టేషన్లలాగా కళ్లముందరకు వస్తాయి. తన ముందు అద్దంలో ప్రతిబింబం వెక్కిరిస్తుంది. తనకంటే తన బొమ్మే అందంగా వుందని అనిపిస్తోంది. ఎన్ని రకాల ప్రయత్నం చేసినా, ఎన్ని పద్ధతుల్లో చూచినా తనకు తన ప్రతిబింబమే దర్శనమిస్తోంది.

కథానాయకుడికి వుండవలసిన లక్షణాల్లో ఒకటి అతని విషయంలో లోపించినట్లనిపిస్తుంది. అతను నడుస్తుంటే వాద్యబృందాలు మ్రోగటంలేదు. అతనికింద గుర్రం నడవడం కాదు. గుర్రంకంటె బరువయిన హృదయాన్ని అతనే మోసుకుపోతున్నాడు. అతను యింట్లోకి వస్తున్నప్పుడు బయటకు పోతున్నప్పుడు ఈలపాటతో అతనే ట్యూను వేసుకుంటున్నాడు. ఈలపాట పాడతాడు. ఆ పాట అతని అడుగులకు తానం సరిపుచ్చుతుంది. అతని శరీరావయవాలు పరస్పర సహకారాన్ని ఇస్తూనేవుంటాయి.

స్వవిషయంలో అయితే ఫరవాలేదు. అప్పుడప్పుడు 'అందాల మేఘమాలా' అని పాడతాడు. అతని మాటలే అతని చెవులకి వినబడతాయి. అవి మేఘాల దగ్గరకు పోలేవు. తను మేఘాలను పాంచాలి గుడిసెమీద కూడా ఎగిరి తన ప్రేమసారాన్ని వర్షించమని కోరతాడు. అప్పుడు మేఘాలు తనింటిమీద కూడా యింకో దిక్కుకు పోతాయి. వాటిని మనసులో ఎంతగానో ప్రార్థిస్తాడు. తన ప్రేమసారాన్ని పాంచాలి గుడిసెమీద కాకపోతే యింకెక్కడా వర్షించవద్దని, తన నిష్కల్మష ప్రేమను అపవిత్రం చెయ్యవద్దని అతని కొచ్చిన భాషలో చెప్పుకుంటాడు.

ఒకోసారి పాంచాలి గుడిసెమీదగా తనింటికి మేఘాలు వస్తూ వుంటాయి. అవేమయినా సందేశం తెస్తున్నాయేమోనని ఎదురుచూస్తాడు. ఒక్కొక్క తెల్లని మేఘం వారి ప్రేమ స్వచ్ఛతను తెలియజేస్తున్నట్లు అతనికి తోస్తుంది. ఆ మేఘం కనుచూపుమేర దాటేంతవరకూ అలాగే గుడ్లప్పగిస్తాడు. అతని హృదయంలో వక భీతి కలుగుతుంది. ఒక అనుమానం బయలుదేరుతుంది. సందేశం తెచ్చిన మేఘం తన గుడిసెమీద ఆగక ఇంకెక్కడకో పోతోందేం... ఆ సందేశం ఎవరి దగ్గరకు తీసుకుపోతుందో! అతని గుండె అతని మాట విననంటుంది. అతను వీల్లేదంటాడు. అతని వక్షస్థలంమీద లోఉంచి దబదబా కసితీరా బాదుతుంది అతని హృదయం...

ప్రేమకోసం బలియైన మజునూలాంటివాళ్లని ఎంతమందినో చూశాడు గోపాలరావు. తనుగూడా అలాగే ప్రేమించి బలియైపోవాలనుకున్నాడు. లైలా మజునూ సినిమా చూచి వచ్చిన రాత్రి కలవరించాడు. తన పాంచాలిని ఎవరికో యిచ్చి వివాహం చేశారు. ఆమె ఒంటెలమీద ఎక్కడికో వెళ్లిపోతోంది... అతను ఒంటెకాళ్ల పట్టుకుని ఆమె కూర్చున్నచోటికి పాకగలిగాడు. ఆమె బెదిరింది. కన్నీరు కార్చింది. అతను ప్రేమభిక్ష పెట్టమన్నాడు. అతన్నెవరో తోసేస్తున్నారు. కింద పడిపోతున్నాడు... నిలదొక్కుకోలేకపోయాడు. కిందపడిపోయాడు. అప్పటికే కింద పాంచాలి పడిపోయి ఉంది. చచ్చిపోయిందని వెంటనే తెలుసుకోలేకపోయాడు. తరువాత తనుగూడా చచ్చిపోదామనుకున్నాడు. ఎంత ప్రయత్నించినా కుదరలేదు. సినిమాలో మజునూ ఎలా చచ్చిపోయా ఎలా చచ్చిపోయాడో గుర్తుకు తెచ్చుకున్నాడు. అలా చావటం అంత తేలికయిన పని కాదు. భావాల భారం అతని మెదడును కుంగతీసి, అతని హృదయంలోకి వచ్చి అతనికి మేలుకొలుపు ప్రసాదించింది. కళ్లు నులుముకుని చూశాడు. కలలోనైనా ప్రాణత్యాగం చెయ్యలేనందుకు నిందించుకున్నాడు. ఆరోజు ఇంకో సినిమా చూశాడు. అదీ ప్రేమకోసం బలియైపోయిన జీవి గాథే. వాతావరణం వేరుగా ఉంది. మజునూగా వేషంవేసి చచ్చిపోయిన వ్యక్తే ఈ సినిమాలో గూడా చచ్చిపోతాడు. గోపాలరావు మనస్సు తేలికపడుతుంది. ఆరోజు

రాత్రయినా ఆ సినిమానంతా కలగందామనుకున్నాడు.

ఆ రాత్రి కల రాలేదు. తెల్లవారు జామున మెలకువ వచ్చింది. ఆనందభవన్ ముంగిట నిలబడి పాంచాలి ఇంటివైపు దృష్టి ప్రసరించాడు. పాలసముద్రంలో తిమింగిలాల్లాగా ఆ తెల్లని వెన్నెల్లో గుడిసెలన్నీ కనపడుతున్నాయి. భావుకుడై కళ్లు మూసుకుని గుడిసెవైపు చూశాడు. పాంచాలి ఆ గృహ ప్రాంగణంలో నిలబడింది. ఆమె ముత్తైదువు ముఖాన బొట్టులాగా ఉంది. అతను ముత్తైదువు నుదురులాగా మారిపోయి ఆమెను తన గుండెల్లోకి చేర్చుకుందామనుకున్నాడు. అతని భావన కరిగిపోయింది. కళ్ళు తెరిచాడు.

అతని ఎదురుగా పాంచాలి నిలబడింది. అతను వళ్లంతా కళ్లుగా చేసుకున్నాడు. ఆమె శరీరాన్ని అతని కళ్లన్నీ కలిసి కబళించి వేస్తున్నాయి. ఆమె నవ్వటం లేదు. ఆమె పెదవులు దొండపండును గుర్తుకుతేలేదు. ఆమె కనుకొలకులలో మెరమెరను చూస్తే మహోన్నతమయిన శిఖరానికెక్కి లోయలోకి తొంగిచూసినట్లు తోచింది. అతను కళ్లు మూసుకున్నాడు. తిరిగే కళ్లు తెరచేటప్పటికి పాంచాలి అక్కడ లేదు. ఆమె అడుగులజాడలు పోను పోను చిన్నవైపోతూ ఆమె ఇంటిలోకి జొరపడ్డాయి. వాటిని చూస్తే స్వర్గానికి వేసిన నిచ్చెనమెట్లలా కనపడుతున్నాయి. వాటి వెంబడి పోదామనుకున్నాడు. మెట్లున్నాయి గాని పట్టుకోవటానికి వాసాలు లేవు. అతనికి ధైర్యంచాలలేదు. ఇంట్లోకి పోయి తన హృదయాన్ని కన్నీళ్లతో కడుక్కున్నాడు.

అతనికిప్పుడు ఒక పెద్ద లోపం ఒకటి కనిపిస్తోంది. కథలో నాయకుడూ, నాయకురాలూ ఉన్నారుగాని విలన్ లేడు. ఎవరయినా దుష్టపాత్ర ఉండాలి. అటువంటిదానిలో అతని ప్రేమకు పోటీపడి ఆ ప్రేమాగ్నిలో పడి శలభంలా కాలిపోయే భీరువయితే కథ సుఖాంతం అవుతుంది. కలల్లో ట్రాజెడీ కోసం కలవరించి చచ్చిపోలేక కల వదుల్చుకుని నిజప్రపంచంలోకి వస్తున్నాడు. అటువంటిది నిజప్రపంచంలో కథ సుఖాంతంగానే ఉండాలి. దుఃఖాంతమయితే తను తన జీవితపాత్రను ఎంత చక్కగా నిర్వహించిందీ బయటవాళ్లకు తెలియవచ్చుగాని అతను ఆనందించే అవకాశం ఉండదు.

ఆ దుష్టపాత్ర అతనికి దానంతట అది కొంతకాలానికి దొరికేవరకు అతను ఊహించనే లేకపోయాడు. పాంచాలి వివాహం నిశ్చయమైంది. ఆ సంగతి తనకు కబురుగూడా అందలేదు. ఎవరో చెప్పగా విన్నాడు. పాంచాలినడిగి నిజం తెలుసుకుందామనుకున్నాడు. వాళ్లింటికి ఏ ముఖం పెట్టుకు పోవాలో నిర్ణయించుకోలేక ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నాడు.

ఆరోజు రాత్రి పెళ్ళి. సన్నాయి రాఘవులు వాయిస్తున్నాడు. ఆ వాద్యం తన ప్రేమపాశాన్ని ముక్కలుముక్కలుగా ఛేదిస్తున్నట్లు తోస్తోంది. డోలు చప్పుడు అతని వెన్నెముకమీద దుష్టనృత్యం చేస్తోంది. మేళం ఆపెయ్యమని చెప్పుదామనిపించింది. మేఘాలు పాంచాలి ఇంటిమీదుగా వచ్చినవి తన వాకిట్లో వర్షిస్తున్నాయి. మేళాలు వినబడుతూనే ఉన్నాయి. ఆ వానలో నిలబడి శరీరాన్నంతటినీ తడుపుకున్నాడు. అతను పాంచాలి ఆలింగనంలో మైమరచినట్లు వూహించాడు. వాన పెద్దదయింది. మీద చురుక్కు చురుక్కుమని తుంపరలు రాలుతున్నాయి. ప్రేమబాణాలు పూలబాణాలుగా ఉన్నంతకాలం సహించగలిగిన ప్రేమికుడు వాడి తూపుల తాకిడికి తాళలేకపోయాడు. గుడిసెలోకి జొరబడి బట్టలు మార్చుకున్నాడు.

వాన వెలిసింది. పెళ్లివారు వూరేగుతున్నారు. తన వాకిటి ముందుగానే పోవచ్చు. ఒంటెలమీద పోయే లైలా బంగారు పల్లకిలో పోయే మల్లీశ్వరీ గుర్తుకువచ్చారు. తన స్థితి నిర్ధారణ చేసుకునేలోపుగనే పెళ్లిమేళం వాకిటి దగ్గరకు వచ్చింది. పోటీపడి ఇద్దరు డప్పులవాళ్లు నృత్యం

చేస్తున్నారు. పాంచాలి తన కొంగును ఎవరి జీవితానికో ముడి వేయించుకుంది. కాళ్లకి చెప్పులు గూడా లేకుండా పాదచారియై తన వాకిటిగుండా పోతోంది. తలుపు లోపల కానుకుని చూరులోనుంచి చూస్తున్నాడు. అన్నీ మంగళవాద్యాలే. విషాదంగా స్వరం వినబడటం లేదు. అవి అతన్ని వేధిస్తున్నాయి. మంగళస్వరం దూరం అయిపోయింది. అప్పటిదాకా పెద్దపెట్టున నవ్వుతున్నట్లు చప్పుడు చేస్తున్న గాలి, భోరుమని ఏడుస్తున్నట్లు వినిపిస్తోంది.

ఆ రాత్రి నిద్రపట్టలేదతనికి. ఎన్నో కలవరిద్దామనుకున్నాడు. ఒక్కటీ కుదరలేదు. చీకటి వెలుగుకు చోటిచ్చింది. తన గుడిసెమీద కెక్కిన కోడి అతన్ని లేవమని హెచ్చరించింది.

అట్లా ఎన్నిరోజులో గడిచాయి. అతని కళ్లల్లో నీళ్లన్నీ ఖర్చయిపోయాయి. ఎండిన కళ్లు మండిపోతున్నాయి. నల్లగుడ్డు తేలిపోతోంది.

ఆరోజు దుష్టపాత్ర అతనికి గుర్తువచ్చింది. తన జీవితవనంలో పూలమొక్కలమీద నిప్పులు వర్షించిన అతని జీవితాన్ని అంతం చెయ్యాలనుకున్నాడు అతని దగ్గర రాజుల దగ్గర ఉండే కత్తులుగానీ, విల్లంబులు గానీ లేవు. శూలాలు లేవు, గదలు లేవు, కత్తిపీట ఉంది. పచ్చడి బండ ఉంది. కంకటి రాళ్లున్నాయి. అతను ఆలోచిస్తున్నాడు.

ముడి తెగిపోతే చిల్లుపడిన కుండమాదిరి పాంచాలి జీవితం అయిపోయి ఆమె జీవనస్రవంతి ఆగిపోతుందేమో! ఎండిపోయిన మోళ్లనా అతను ఆశించింది? లేచిగుళ్లతో, పచ్చని పూలతో ఉన్న కల్పవృక్షాన్ని ఆశించిన తను, ఆ వృక్షం ఎవరి దోడ్లోనయినా ఉంటే, తన దొడ్లో పెంచుకోలేనందుకు విచారించినా, ఆ మొక్క ఎక్కడయినా మూడు పువ్వులూ, నాలుగు కాయలూ పొందాలనే గదా కోరుకొనేది!

అతని ఆలోచనలు అతని మెదడు దాటి తలమీద విహరిస్తున్నాయి. పెద్దగా నిస్వనం ఒకటి వదలి వీధిలోకి వచ్చాడు. పాంచాలి ఇంటిమీద మేఘాలు లేవు. ఆకాశమంతా సముద్రంలాగా ఉంది.· పాంచాలి ఇంటిలోనుంచి గొల్లున ఏడుపులు వినిపించినాయి. ఆ తరంగం అతని హృదయానికి సూటిగా, బలంగా వచ్చి తాకింది. పడవ తలక్రిందులయినంత పనయింది. మనసు దిట్టపరచుకున్నాడు. ఆ విషాద స్వరాన్ని అతను ఆశించలేదు. దానికి కారణమేమిటో గూడా అతడు వూహించలేదు. పాంచాలి వేసుకున్న ముడి తెగిపోయింది. లైటులో బ్యాటరీయే బపోయిందో, బలుబే మాడిపోయిందో, అక్కడ వెలుతురు వచ్చే అవకాశం అయిపోయింది. కారుచీకటి తన నల్లని హస్తాలతో అతని జీవితాన్ని చుట్టి విరిచివేస్తోంది. అతని నోట మాట పెగలటం లేదు. ఎక్కడో పాంచాలి మాట్లాడుతున్నట్లు తోచింది. ఆవిర్భవించిన స్థానం తన ఉనికిని చెప్పటం లేదు. బాగా పరిశీలించాడు. అతని హృదయం మాట్లాడుతోంది. బాగా విన్నాడు. మాటల వివరం తెలియకపోయినా భావం స్ఫుటంగా స్ఫురిస్తూనే ఉంది. మైలురాయి దగ్గిర కూలబడిపోయి దాన్ని కౌగలించుకుని నిజమైన ఏడుపు వినిపించాడు. అతని తంత్రులన్నీ విషాదగీతాన్ని ఆలపించినాయి. అతని అణువు అణువు వుద్రేకించి కన్నీరుగా మారింది. అతదని హృదయం కరిగిపోయింది. ఆ ఏడ్పులో అతని ప్రేమపాశం చుక్కాని లేని పడవలా తేలిపోయింది. అతను అక్కడినుంచి లేవలేదు. తిరిగి అతని మనస్సు కలవరించటానికి ప్రయత్నమయినా చెయ్యలేదు.

**(తెలుగు స్వతంత్ర - 4 జనవరి, 1957)**